సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



తనయుడి చేతిలో తండ్రి హతం

కుటుంబ సమస్యల కారణంగా కన్నతండ్రినే దారుణంగా హతమార్చిన సంఘటన సోమవారం మండల కేంద్రమైన ఓబులవారిపల్లెలో చోటు చేసుకుంది. - 10లో



హోరాహోరీగా మ్యాచ్‌లు

ఏసీఏ అంతర్ జోనల్ అండర్-23 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాల్లో మ్యాచులు సాగుతున్నాయి. - 10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.110	రూ.220



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 207 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	--	430
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 74.080 కిలోలు

తరుముకొస్తున్న తుపాన్

- మిచాంగ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- రైల్వేకోడూరు వద్ద శేషాచలం నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు
- తుపాను నేపథ్యంలో కంట్రోల్ రూముల ఏర్పాటు
- తడిసిన ధాన్యం కొనుగోలుకు సిద్ధమైన ప్రభుత్వం

మిచాంగ్ తుపాను ముంచుకొస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. మంగళవారం తుపాన్ తీరం దాటనున్న నేపథ్యంలో బలమైన ఈదురుగాలులు, వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన అధికారులు.. రెండు జిల్లాల్లోనూ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

సాక్షి రాయచోటి: తుపాను ప్రభావంతో వైఎస్సార్, అన్నమయ్య జిలాల్లో వాన జడిపట్టి కురుస్తోంది. ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు ప్రాంతంలో భారీ వర్షం నమోదైంది. గుంజనేరు నది నిండుగా ప్రవహిస్తోంది. జనాలు బయటికి రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. బాలుపల్లె వద్ద జాతీయ రహదారిపై శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన వర్షపు నీరు పారుతుండడంతో కడప-తిరుపతి మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రయాణి కులకు ఇబ్బందులు తలెత్తకుండా జేసీబీ ద్వారా చెత్తాచెదారాలు తొలగించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

భారీ వర్షంతో పంట పొలాల్లోకి నీరు

అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో భారీ వర్షాలతో పంటలు దెబ్బతినే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాయచోటి, పీలేరు, మదనపల్లె తదితర ప్రాంతాల్లో పొలాల్లో చేతికొచ్చే స్థితిలో ఉన్న వరి పంటకు నష్టం వాటిల్లేలా కనిపిస్తోంది. మరోవైపు కోడూరు ప్రాంతంలో అరటి, బొప్పాయి, మామిడి తోటల్లో ఎక్కడ చూసినా వర్షపు నీరు నెలకొంది. తడిసిన ధాన్యాన్ని పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేసేందుకు ఇప్పటికే ప్రభు త్వం ఆదేశించింది. వైఎస్సార్ జిల్లాలో 8 మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో అత్యధికంగా సిద్దవటంలో 6.64 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. తుపాను అనంతరం పంట నష్టం అంచనా వేయనున్నారు.



నిండుగా ప్రవహిస్తున్న గుంజనేరు నది

విద్యాసంస్థలకు నేడు సెలవు

రాయచోటి: తుపాను ప్రభావం నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలలు, విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రైల్వేకోడూరు, రాజంపేట తదితర ప్రాంతాలలో తుఫాను ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ కోరారు.



రాయచోటి పట్టణంలో కురుస్తున్న వర్షం



కడప ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

కంట్రోల్ రూంలు ఏర్పాటు..

అన్నమయ్య జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్

08561-293006

'మిచాంగ్' తుఫాన్ దృష్ట్యా జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు.రాబోయే రెండు రోజుల పాటు బలమైన ఈదురుగాలులు, భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సూచించిందన్నారు. ఈ మేరకు నదులు, వంకలు, పరివాహ ప్రాంతాలు అన్ని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలందరూ అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. మిచాంగ్ తుఫాను సహాయక చర్యల నిమిత్తం రాయచోటి కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్ 08561-293006 ఏర్పాటు చేశామని ఈ కంట్రోల్ రూమ్24-7 ప్రకారం 3 షిఫ్టులు పనిచేస్తుందన్నారు.

కంట్రోల్ రూం పని వేళలు

- ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు
- మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి 10 గంటల వరకు
- రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు



రాయచోటి కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న సిబ్బంది

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రాయచోటి : మిచాంగ్ తుపాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లాలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణితో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా కురువనున్న వర్షాలపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి తీసుకోవాల్సిన సహాయక చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. వర్ష ప్రభావిత ప్రాంతాలలో అవసరమైన అన్ని సహాయక చర్యలను వేగవంతం చేయాలన్నారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక శిబిరాలలో ఆహారం, తాగునీరు, మందుల సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పొలాలు, కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరబోసిన ధాన్యాన్ని తడిసిపోకుండా వెంటనే మిల్లులు లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. బలమైన ఈదురు గాలులు, భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలియజేసినందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాజెక్టుల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, భారీ వర్షాలు, ఈదురు గాలులతో దెబ్బతిన్న విద్యుత్ స్థంబాలు, లైన్లను పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖ తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగులు, వంకల దగ్గరికి ప్రజలు ఎవరూ వెళ్లకుండా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎస్‌డీసీ శ్రీలేఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఇతర శాఖల అధికారులు

• జలపాత సొగసు



రైల్వేకోడూరు శేషాచలం అటవీప్రాంతాలలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదారిపై నీళ్లు పారుతున్నాయి. సోమవారం కుక్కలదొడ్డి బాలపల్లె మధ్య సమీపంలోని ప్రధాన రహదారిలో వర్షపు నీరు జలపాతమై కనువిందు చేసింది. - రైల్వేకోడూరు అర్బన్

న్యూస్‌రీల్

పంచాయతీలలో నగదురహిత లావాదేవీలు

– జిల్లా పంచాయతీ అధికారి

రాయచోటి : గ్రామ పంచాయతీలలో పన్నులు, పన్నేతర లావాదేవీలు నగదు రహితంగా జరిగేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మీ పంచాయతీ కార్యదర్శులు, విస్తరణ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్, గ్రామీణాభివృద్ధి అధికారి సూచనలు మేరకు అన్నమయ్య జిల్లాలోని 501 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారులకు తెలియజేశామని పేర్కొన్నారు. ఇకపై నగదు లావాదేవీలు జరిపిన పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు.

కలెక్టర్‌ను కలిసిన జనన, మరణ రిజిస్ట్రేషన్ డైరెక్టర్

రాయచోటి : రాష్ట్ర జనన, మరణ సివిల్ రిజిస్ట్రేషన్ డైరెక్టర్ బాల కిరణ్ అన్నమయ్య కలెక్టర్ గిరీషా పీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్‌ను ఆయన కలిసి జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, డీసీహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్, డీపీఎంఓ రియాజ్, వైద్య శాఖ జిల్లా గణాంకాధికారి ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆటా' సదస్సుకు ఆహ్వానం

వైవీయూ : అమెరికా తె లుగు సంఘం (ఆటా) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఈనెల 17న నిర్వహించే అంతర్జాతీయ సాహితీ సదస్సుకు వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు డా॥తప్పెట రామప్రసాద్‌రెడ్డికి ఆహ్వానం లభించింది. 'జానపద దృశ్యకళారూపాలు-ప్రదర్శనా పద్ధతులు' అన్న అంశంపై ఈయన ఉపన్యసించనున్నారు.

13న క్రీడా పోటీలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం మూడో దశ అంతర్ కళాశాల పోటీలు ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డా॥కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ (పురుషులు, మహిళలు), బెస్ట్ ఫిజిక్ (పురుషుల) క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైవీయూలోని వ్యాయామవిద్య, క్రీడాశాస్త్రశాఖ ఆవరణలో నిర్వహించే ఈ పోటీలకు 17 నుంచి 25 సంవత్సరాల లోపు విద్యార్థులు అర్హులన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ నుంచి స్టడీ సర్టిఫికెట్, టెన్త్, ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 97054 59052 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ బి.కృష్ణారావు పోలీస్ యంత్రాన్ని ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ నేరుగా స్వీకరించారు. ప్రజల ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారంపై ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. ఈ స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 40 ఫిర్యాదులు అందాయి. స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలని ఎస్పీ ఆదేశించారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

7న కేంద్ర కరువు బృందం పర్యటన

రాయచోటి : కేంద్ర కరువు బృందం ఈ నెల 7వ తేదీన జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గిరీషా పీఎస్, కేంద్ర కరువు బృందం రాక సందర్భంగా ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 7వ తేదీ ఉదయం 9 గంటలకు కేంద్ర కరువు బృందం అన్నమయ్య జిల్లాకు చేరుకుంటుందని పేర్కొన్నారు. జిల్లాలో కరువు వల్ల దెబ్బతిన్న వివిధ పంటలను కేంద్ర బృందం పరిశీస్తుందని వివరించారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా 15,388 హెక్టార్లలో వేరుశనగ పంట వర్షాభావ పరిస్థితుల వల్ల పంట దిగుబడి తగ్గిందన్నారు. కరువు బృందం సభ్యులు రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రాయచోటి, చిన్నమండెం, పెద్దమండెం, తంబళ్లపల్లె, కురబలకోట మండలాలలో పర్యటిస్తారన్నారు. ఇందులో ముఖ్యంగా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ, డ్వామా, నీటిపారుదల శాఖలు, ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు సీపీఓతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పంట నష్టాలకు సంబంధించి పవర్ పాయింట్‌ప్రజెంటేషన్ ఇవ్వడం జరుగుతుందని సీపీఓ కరువుకు సంబంధించిన నోట్స్ తయారు చేసి వెంటనే తమకు ఇవ్వాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ విభాగపు తహసీల్దార్ శ్రావణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్నకుమార్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై, డ్వామా పీడీ మద్దిలేటి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



కరువు బృందం పర్యటనపై అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

అలరించిన ఉర్దూ కవి సమ్మేళనం



కవి సమ్మేళనం సందర్భంగా మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ సెక్రటరీ మస్తాన్ వల్లి

మదనపల్లి సిటీ: మదనపల్లిలో సోమవారం సాయంత్రం స్థానిక బడే మఖాన్లో 24వ అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం అలరించింది. వర్షపు జల్లులకు తోడు.. కవుల మది నుంచి జాలువారిన కవితా ఝరికి ప్రేక్షకులు నిండుగా తడిసి ముద్దయ్యారు. అంతకుముందు కవి సమ్మేళనాన్ని రాష్ట్ర ఉర్దూ అకాడమీ సెక్రటరీ మస్తాన్ వల్లి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

కవుల సేవ అభినందనీయం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేస్తున్న కవులును కళాకారుల సేవలను కొనియాడారు. మదనపల్లిలో 24 సంవత్సరాలుగా ఉర్దూ కవి సమ్మేళన నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందుకోసం ఈ ఏడాది 25000 నగదును కవి సమ్మేళనానికి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీం, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్సే కరీముల్లా, కవి సమ్మేళనం కన్వీనర్ ఖమర్ అమీని, మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.కవి సమ్మేళనానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కవులు పాల్గొన్నారు.

• కార్తీకశోభ

సాక్షి నెట్‌వర్క్ : కార్తీక మాసంలోని మూడో సోమవారం సందర్భంగా వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని శైవక్షేత్రాలు కొత్తకళను సంతరించుకున్నా యి. ఓవైపు వర్షం పడుతున్నా భక్తులు ఆయా క్షేత్రాలకు భారీసంఖ్యలో తరలివచ్చారు. పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తి శ్రద్ధలతో పూజలను నిర్వహించారు.

పొలతలలో..

పొలతల క్షేత్రంలో శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతీదేవిల కల్యాణం ఉదయం 10 గంటల నుంచి 12.00 గంటల వరకు నిర్వహించారు. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, అరుణమ్మ దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని వీక్షించారు.



పొలతలలో కల్యాణానికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే దంపతులు



పుష్పగిరిలో భక్తుల సందడి

రక్షణ గాలికొదిలేస్తారా!

సౌమ్యనాథాలయంలో...

కూలిపోయేదశలో ప్రాచీనరక్షణ గోడ!

- భక్తుల్లో ఆందోళన
- పట్టించుకోని కేంద్ర పురావస్తుశాఖ



సౌమ్యనాథాలయం వ్యూ



గతేడాది డిసెంబర్‌లో కూలిన సౌమ్యనాథుని రక్షణ గోడ

రాజంపేట : కలియుగ ప్రత్యక్షమైన శ్రీ వెంకటేశ్వర స్వామిని పోలిన మూలవిరాట్టు. ఎర్రరాతితో ఆలయ నిర్మాణం.. అదే నందలూరు గ్రామంలోని సౌమ్యనాథాలయం. చోళ, మట్లిరాజుల కళా నైపుణ్యానికి అద్దంపట్టే ఈ కోవెల రక్షణ ఇప్పుడు గాలిలో దీపంలా మారింది. అవును.. ఆలయ రక్షణ గోడలు శిథిలమవుతూ...దశలవారీగా కూలిపోతూ వస్తున్నాయి. సౌమ్యనాథాలయం కట్టడాలు, ఆలయనిర్మాణం కేంద్రపురావస్తుశాఖ ఆధీనంలో ఉన్నాయి. ఆలయ నిర్వహణ తిరుమల తిరుపతి దేవస్థానం చూస్తోంది.

ఆలయ నిర్మాణం ఇలా..

విశాలమైన ప్రాంగణం మూడు రాజగోపురాల మధ్య ఉన్న ఈ ఆలయం పది ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఈ ఆలయం 108 స్తంభాలతో ఉంటే అన్నింటిపైన భాగవతం రచించి ఉండటం కనిపిస్తుంది. 11వ శతాబ్దంలో కులోత్తుంగచోళుడు ఈ ఆలయ పునఃనిర్మాణానికి పూనుకున్నారని, అలా పునఃప్రారంభమైన ఈ క్షేత్ర నిర్మాణంలో పాండ్య, కాకతీయ, విజయనగరరాజు సైతం పాల్గొన్నారని చరిత్ర చెబుతోంది.

శిథిలమవుతున్న రక్షణ గోడలు...

ఎర్రరాతిని ఉపయోగించి ఆలయానికి రక్షణ గోడలు నిర్మించారు. దక్షిణ, ఉత్తర,తూర్పు గాలిగోపు రాలు ఉండేవి. దక్షిణగాలిగోపురం ఇప్పుడు లేదు. ఈమూడింటిని కలుగపుతూ పెద్దఎత్తున ఎర్రరాతి బండలతో పెద్దగా రక్షణగోడలను నిర్మితం చేశారు. ఈ ప్రహరీ మధ్యలో ఆలయం కనిపించకుండా కేవలం గర్భాలయం కనిపించేలా రక్షణ గోడలను నిర్మితం చేశారు. ఇప్పుడు అంతర్భాగంలోని ఆలయం కనిపిస్తోంది. దీన్ని బట్టి రక్షణ గోడలు ఏ మేరకు ఎంతవరకు కూలిపోతూ వస్తున్నాయో ఇట్టే అవగతమవుతుంది. ఇప్పుడు ఇటుకలు ఉన్నంతవరకు కూలిపోయే మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. ఆలయం వెనుకవైపు మాఢవీది రక్షణ గోడ దెబ్బతింది. అపరిశుభ్రత తాండవిస్తోంది. స్థానికులు ఆలయం అన్న సంగతి మరిచిపోయి, అపవిత్రం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పురావస్తు శాఖ అధికారులు స్పందించి ఆలయ రక్షణకు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

గత ఏడాదిలో..

గత ఏడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు ఆలయం ఉత్తర ద్వారా గాలిగోపురం ఆనుకొని ఉన్న రక్షణ గోడ కుప్పకూలిపోయింది. కూలిపోయి ఏడాది అవుతున్న ఇంతవరకు పునఃనిర్మాణం చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూలిన రక్షణ గోడ నిర్మాణానికి టెండర్లు



సౌమ్యనాథాలయంలో గత ఏడాది డిసెంబరులో కూలిన గోడ పునఃనిర్మాణానికి నవంబరులో కేంద్రపురావస్తుశాఖ టెండర్లను పిలిచింది.ఈ విషయాన్ని కేంద్రపురావస్తుశాఖ అసిస్టెంట్ కన్సర్వేటర్ యోగీష్ తెలిపారు. జనవరిలో పనులు ప్రారంభించి, మార్చినాటికి పూర్తిచేస్తామని స్పష్టంచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– మేడావిజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ, నందలూరు

సౌమ్యనాథాలయ ప్రాచీన కట్టడాలను కాపాడుకోవాలి



సౌమ్యనాథాలయ ప్రాచీన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్రపురావస్తుశాఖదే. ఆలయం ప్రహరీని పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలి. అలనాటి చోళ, మట్టిరాజుల కళావైభవాన్ని భావితరాలకు అందించాలంటే ఆలయ పరిరక్షణ ఎంతో ముఖ్యం. ఆలయశాసనాలను కూడా భద్రపరచాలి. దక్షిణగాలిగోపురం కూడా నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– విద్వాన్ డా.గానుగపెంట హనుమంతరావు, చరిత్రపరిశోధకుడు, కడప

క్లుప్తంగా

బైకును ఢీకొన్న కారు



ప్రమాద దృశ్యం

బి.కొత్తకోట : బైకును కారు ఢీకొన్న ఘటన సోమవారం ఉదయం జరిగింది. బి.కొత్తకోట మండలం బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన బయ్యప్ప, విమలమ్మ గడ్డి కోసం బైక్‌పై కొత్తపల్లెకు వెళుతున్నారు. కొత్తపల్లె వద్ద మలుపు తిరుగుతుండగా, మదనపల్లె నుంచి బి.కొత్తకోట వస్తున్న కారు ఢీకొంది. ఘటనలో ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తనయుడి చేతిలో తండ్రి హతం



మృతి చెందిన సయ్యద్ మహమ్మద్

ఓబులవారిపల్లె : కుటుంబ సమస్యల కారణంగా కన్నతండ్రినే దారుణంగా హతమార్చిన సంఘటన సోమవారం మండల కేంద్రమైన ఓబులవారిపల్లెలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసు స్టేషన్ సమీపంలో నివాసముంటున్న సయ్యద్ మహమ్మద్(60) తమలపాకు తోటల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వారం రోజుల నుంచి కుటుంబ సమస్యలతో మహమ్మద్‌కు అతని కుమారుడు సయ్యద్ మహబూబ్‌బాషాకు మధ్య గొడవ జరుగుతోంది. ఈనేపథ్యంలో సోమవారం కూడా వీరి మధ్య ఘర్షణ జరిగింది. తన వెంట తెచ్చుకున్న కర్రతో మహబూబ్‌బాషా తండ్రి తలపై బలంగా కొట్టాడు. దీంతో మహమ్మద్‌కు తల పగిలి రక్తపు మడుగులో పడిపోయాడు. అతని భార్య గోరీ కేకలు వేయడంతో పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వ్యక్తిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు. మృతునికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొండామారిపల్లె పంచాయతీ ఇసుకనూతిపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు రమేష్(30) కుటుంబన మస్యల కారణంగా ఇంటివద్దే విష ద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సౌకర్యవంతంగా రిజిస్ట్రేషన్ సేవలు

- రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసిన ప్రభుత్వం
- మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కార్డు ప్రైమ్ 2.0 విధానం
- ఇరవై నిమిషాల వ్యవధిలోపే ప్రక్రియ పూర్తి
- ఇప్పటికే వైఎస్సార్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు



కడపలోని రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సేవలను సరళతరం చేసింది. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా క్రయ విక్రయదారులకు కచ్చితమైన సేవలు అందించేలా కార్డు ప్రైమ్ 2.0 ద్వారా నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని వైఎస్సార్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికే ప్రారంభించారు. అయితే అన్నమయ్య జిల్లాలో గత మంగళవారం నుంచి ఈ నూతన సాఫ్ట్‌వేర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఈ నూతన విధానంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారుడే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లను తయారు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో సూచించిన మేర స్టాంపు డ్యూటీ, యూజర్ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే ప్రక్రియ సులభంగా జరిగిపోతుంది. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ శాఖతో సంబంధం లేకుండా డాక్యుమెంట్ తయారీ, చలానా కట్టడం వంటివి బయటే చేసుకునేవారు. వీటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమర్పిస్తే రిజిస్ట్రేషన్ చేస్తూ వచ్చారు. అయితే ఈ ప్రక్రియ పెద్ద ప్రహసనంగా ఉండేది. పైగా మధ్యవర్తుల ప్రమేయం ఎక్కువగా ఉండేది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ అవకాశాలకు స్వస్తి పలుకుతూ కార్డ్ ప్రైమ్ 2.0 అనే నూతన విధానాన్ని తీసుకొచ్చింది.

12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు

వైఎస్సార్ జిల్లాలో కడప అర్బన్, రూరల్, సిద్దవటం, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, ముద్దనూరు, దువ్వూరు, కమలాపురం, వేంపల్లె, పులివెందుల, బద్వేలులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలో గత నెల 14వ తేదీ నుంచి 2.0 కార్డు ప్రైమ్ నూతన విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. ఈ విధానంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. దీంతో ఇప్పటివరకు జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కార్డ్ ప్రైమ్ 2.0 విధానం ద్వారా 2051 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

అన్నమయ్య జిల్లాలో..

అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, పుల్లంపేట, చిట్వేలి, లక్కిరెడ్డిపల్లె, సుండుపల్లె, మదనపల్లె, వాయల్పాడు, బి.కొత్తకోట, పీలేరు, తంబళ్లపల్లె కలికిరిలలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో గత మంగళవారం నుంచి కార్డు ప్రైమ్ 2.0 విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్డు ప్రైమ్ 2.0 విధానం ద్వారా చాలా సులభంగా డాక్యుమెంట్లను తయారు చేసుకోవచ్చు. ఆస్తి వివరాలు, పేరు, ఆధార్ వంటి సమాచారాన్ని ఎంటర్ చేస్తే వెంటనే ఆస్తికి సంబంధించిన మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు ఎంత కట్టాలో స్క్రీన్‌పైనే చూపుతుంది. ఆ సొమ్మును ఆన్‌లైన్‌లోగానీ లేదా ఆఫ్ లైన్‌లోగానీ స్టాక్ హోల్డింగ్ ద్వారా చలానా కట్టవచ్చు. అనంతరం రిజిస్ట్రేషన్ టైమ్, శ్లాట్ బుక్ చేసుకుని ఆ సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే సరిపోతుంది. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ పరిశీలిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తారు. ఇందుకోసం దాదాపు 20 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉంది. అంతకుముందు అయితే రోజంతా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉండాల్సి వచ్చేది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన విధానం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో కార్డు ప్రైమ్ 2.0 విధానం ద్వారా ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్లు

ప్రాంతం	జరిగిన రిజిస్ట్రేషన్లు
కడప అర్బన్	220
కడప రూరల్	313
బద్వేలు	92
జమ్మలమడుగు	181
కమలాపురం	154
ప్రొద్దుటూరు	517
మైదుకూరు	153
ముద్దనూరు	45
పులివెందుల	145
వేంపల్లె	115
దువ్వూరు	71
సిద్దవటం	45
మొత్తం	2051

సద్వినియోగం చేసుకోవాలి



కార్డు ప్రైమ్ 2.0 విధానాన్ని క్రయ, విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలి. భూములు, ఆస్తుల విక్రయాల్లో పారదర్శకతను పెంచి ఆస్తులను పరిరక్షించేందుకు కొత్త విధానం ఎంతో దోహదపడుతుంది. క్రయ విక్రయదారులు దస్తావేజును స్వతహాగా ఎవరికి వారే తయారు చేసుకుని ఎక్కడ కావాలంటే అక్కడ రిజిస్ట్రేషన్ శ్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. సులువుగా తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అపోహలు వీడి ఈ నూతన విధానానికి డాక్యుమెంట్ రైటర్లు, కక్షిదారులు సహకరించాలి.

- జి.శివరాం, డీఐజీ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ, కడప

హోరాహోరీగా మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జోనల్ అండర్-23 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. కేఓఆర్‌ఎం మైదానంలో 171 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ జట్టు రెండోరోజు సోమవారం 64.4 ఓవర్లలో 201 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సాకేత్‌రామ్ 35 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్ వై. వాసు 5 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్‌జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 48 పరుగులు చేసింది. జట్టులోని జయంత్ 23 పరుగులు చేశాడు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 65 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు 49.1 ఓవర్లలో 207 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆశిష్‌రెడ్డి 40 పరుగులతో క్రీజులో నిలిచాడు. సెంట్రల్‌జోన్ బౌలర్లు రుకేష్‌బాబు 4, నవీన్ 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్‌జోన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 3.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 7 పరుగులు చేసింది. కాగా సెంట్రల్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 139 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.



కేఓఆర్‌ఎం మైదానంలో తలపడుతున్న సౌత్‌జోన్, రెస్ట్ ఆఫ్ జోన్ జట్లు



5 వికెట్లు తీసిన నార్త్‌జోన్ బౌలర్ వాసు



4 వికెట్లు తీసిన సెంట్రల్‌జోన్ బౌలర్ నవీన్



4 వికెట్లు తీసిన రుకేష్‌బాబు

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూరు : చెన్నూరు టౌన్ సచివాలయ పరిధిలో గల రసూల్ బేగ్‌కు చెందిన అద్దె గదిలో అక్రమంగా సేకరించి ఉంచిన ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాషా, బాలగంగాధర్ రెడ్డి తెలిపారు. సోమవారం వీరు 115 బస్తాలలో రవాణాకు సిద్ధంగా ఉన్న 5,666 కిలోల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని గుర్తించారు. చెన్నూరుకు చెందిన కొండూరు హరిక్రిష్ణ అనే వ్యక్తి తన యజమాని చెన్నూరు టౌన్‌కు చెందిన కాటం వీరబ్రహ్మయ్య ఆదేశాల మేరకు చెన్నూరు చుట్టు పక్కల గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి వాటిని అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలిసిందన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ. 2,35,139 ఉంటుందన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చెన్నూరు సీఎస్ డీటీ మనోజ్‌కు అప్పగించి ఈ అక్రమ రవాణాకు సహకరిస్తున్న చెన్నూరుకు చెందిన కాటం వీర బ్రహ్మయ్య, కొండూరు హరిక్రిష్ణలపై చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

పిల్లల చదువులకు భరోసా



నేను దినసరి కూలి. మా ఆయన ఆటో డ్రైవర్. నాకు నలుగురు కుమార్తెలు. ఒక కుమారుడు. పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గతంలో బిడ్డలకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, దుస్తులు కొనాలంటే భయం వేసేది. బడి తెరిస్తే చాలు పిల్లల కోసం అప్పులు చేయాల్సి వచ్చేది. జగనన్న వచ్చాక అమ్మఒడి పథకంతో డబ్బులు వస్తున్నాయి. దీంతో పిల్లలను చదివించుకుంటున్నా. చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతోంది. జగనన్న పది కాలాలపాటు వర్ధిల్లాలి.

- తహసీన్, చింతపర్తి గ్రామం, వాల్మీకిపురం మండలం

సొంతింటి కల సాకారం



మా కొడుకు మాధవమూర్తి, ఎంటెక్ చదివి, హైదరాబాద్‌లో ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. పెద్ద కుమార్తె ఇందిర, రెండవ కుమార్తె సోనియాకు వివాహమైంది. మాకు ఇంత వరకు సొంతిల్లు లేదు. 40 ఏళ్లుగా మగ్గం నేస్తున్నాను. నాకు స్థలం కొనుగోలు చేసి కట్టుకునే ఆర్థిక స్థోమత లేదు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జగనన్న ఇంటిని మంజూరు చేశారు. దీంతో నేను ఇంటిని నిర్మించుకున్నాను. ఇప్పటికే ఈ ప్రభుత్వం ద్వారా మాకు వివిధ పథకాల ద్వారా రూ.5,73,493 లబ్ధి చేకూరింది. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ చెల్లింపు ద్వారా నా భార్యకు రూ.7,169, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.54వేలు, వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా రూ.48వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా 28వేలు, వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా లక్ష ముప్పై వేలు, వైఎస్సార్ చేయూత రూ.52,250, సొంత ఇంటి నిర్మాణానికి రూ.2.5 లక్షలతో కలిపి మొత్తం రూ.5,73,493 జగనన్న ప్రభుత్వంలో మాకు లబ్ధి చేకూరింది. ఎవరి కాళ్లు పట్టుకోకుండానే మాకు సొంతింటి భాగ్యం కల్పించిన జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

- లక్ష్మీదేవి, వెంకటరమణ దంపతులు, శివపురం, వాల్మీకిపురం.

రేషన్‌కార్డు వచ్చింది



రేషన్‌కార్డు మంజూరు కోసం టీడీపీ పాలనలో ఎన్నోసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేసేదాన్ని. జగనన్న పుణ్యమా అని వలంటీర్ వ్యవస్థ రావడంతో వాళ్లే మా ఇంటికి వచ్చి రేషన్‌కార్డు మంజూరు చేయించారు. చాలా సంతోషంగా ఉంది.

- రాళ్లపల్లి బావులమ్మ, ఇందిరానగర్, ములకలచెరువు

108లో ఒకేరోజు రెండు ప్రసవాలు

మదనపల్లె : ఆపద సమయాల్లో క్షతగాత్రులు, రోగుల పాలిట సంజీవనిగా నిలుస్తున్న 108 అంబులెన్స్‌లు.. అత్యవసర సమయాల్లో ప్రసవాలకు ఆస్పత్రులుగా మారుతున్నాయి. ఒకే వాహనంలో వేర్వేరుచోట్ల, వేర్వేరు సమయాల్లో ఇద్దరు పురిటిబిడ్డలు 108లో పురుడు పోసుకున్న ఘటన సోమవారం జరిగింది. నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయతీ బాలినాయునిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య శ్రీలేఖ మూడోకాన్పులో భాగంగా సోమవారం తెల్లవారుజామున రెండుగంటలకు పురిటినొప్పులు రాగా, కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. ఈఎంటీ రెడ్డి జస్వంత్, పైలట్ సూరిబాబులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. శ్రీలేఖను 108లో ఎక్కించుకుని నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తరలిస్తుండగా, మార్గమధ్యంలో వేకువజామున 2.28 నిమిషాలకు ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ,బిడ్డ క్షేమంగా ఉన్నారు. అలాగే.. ఇదే 108 వాహనానికి ఉదయం 8.30 గంటల సమయంలో వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన మధు భార్య సరిత రెండో కాన్పులో భాగంగా పురిటినొప్పులతో బాధపడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో అక్కడకు చేరుకున్న ఈఎంటీ రెడ్డి జస్వంత్, పైలట్ సూరిబాబులు అక్కడకు చేరుకుని సరితను వాహనంలో ఎక్కించుకుని వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవానంతర చికిత్సల కోసం 108లో ప్రసవం జరిగిన తల్లీబిడ్డలను ఆయా ప్రభుత్వాసుపత్రులకు తరలించారు.



శ్రీలేఖ కుటుంబ సభ్యులకు బిడ్డను అప్పగిస్తున్న 108 సిబ్బంది



వడ్డిపల్లెకు చెందిన సరిత బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

పోలీసు కుటుంబానికి రూ. 1.75 లక్షల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వీబీ రాజ్ కమల్

రాయచోటి : విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కుటుంబానికి రూ. 1.75 లక్షలు ఆర్థిక సాయాన్ని జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ విబి రాజ్ కమల్ అందజేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు ఈ చెక్కును అందజేశారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ కె.రవి ఇటీవల మరణించాడు. దీంతో మృతుడి భార్య క్రాంతి కుమారికి ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. పోలీసు వితరణ నిధి నుంచి ఈ ఆర్థికసాయం అందజేసినట్లు ఏఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను ఏఎస్పీ విచారించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఏఓ కృష్ణుడు, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

శభాష్ .. వెంకటసుబ్బయ్య !



ఆటో డ్రైవర్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : ఓ మహిళ ఆటోలో వెళుతూ రూ. 2లక్షలు విలువైన బంగారు ఆభరణాలు ఉన్న హ్యాండ్ బ్యాగును మరచిపోయింది. ఆటోలో బ్యాగును గుర్తించిన డ్రైవర్ వెంకట సుబ్బయ్య పోలీస్ స్టేషన్‌లో అప్పగించి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సోమవారం కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆటో డ్రైవర్ నల్లకట్ల వెంకట సుబ్బయ్యకు ప్రశంసాపత్రాన్ని అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. వివరాలిలా ఉన్నాయి. రాజంపేటకు చెందిన మేరువ వెంగమ్మ జంగాలపల్లెలోని తన తల్లి ఇంటికి శుభకార్య నిమిత్తం వచ్చింది. ఈనెల 2న కమ్మపల్లెకు వెళ్లి సాయంత్రం ఆటోలో జంగాలపల్లెకు తిరుగు ప్రయాణమైంది. ఈ నేపథ్యంలో ఆటోలో బంగారు నగలున్న బ్యాగును మరిచిపోయింది. బ్యాగును గుర్తించిన ఆటో డ్రైవర్ వెంటనే సమీపంలోని సిద్దవటం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజుకు అందజేశారు. బాధిత మహిళకు పోలీసులు సమాచారం ఇచ్చి నగలతో కూడిన బ్యాగు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఆటో డ్రైవర్‌కు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

శబరిమలలో గుండెపోటుతో అయ్యప్ప భక్తుడు మృతి



మృతుడు వెంకటేష్

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లికి చెందిన వెంకటేష్ (45) అనే అయ్యప్పస్వామి భక్తుడు శబరిమలలో గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లిలోని కుర్నూతల బ్యాంకు వీధిలో నివాసం ఉంటున్న వెంకటేష్ 15 రోజుల క్రితం అయ్యప్పస్వామి మాల ధరించాడు. ఈనెల 2వ తేదీ శనివారం అయ్యప్ప కొండకు బయలుదేరాడు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తూ సోమవారం శబరిమల కొండ ఎక్కే సమయంలో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్న అయ్యప్పస్వామి భక్తులు బంధువులకు సమాచారం అందజేశారు. మృతుడు వెంకటేష్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈయనకు 18 సంవత్సరాల క్రితం వివాహమైంది. ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే మృతుని భార్య, పిల్లలు శోకసంద్రంలో మునిగిపోయారు. శబరిమల నుంచి వెంకటేష్ మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లి మండలం, దప్పేపల్లి గ్రామానికి చేర్చేందుకు తోటి అయ్యప్ప భక్తుల సహకారంతో ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

ఏపీ భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి



న్యాయవాదుల నిరసన ర్యాలీ

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం -2022ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) అధ్యక్షుడు జి.వి. రాఘవరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు, ప్రజాసంఘాలు కడప నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కడపలోని జిల్లా కోర్టు ఆవరణం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ అంబేద్కర్ సర్కిల్, రాజీవ్‌పార్క్ సర్కిల్, ఎల్ఐసీ క్వార్టర్స్, మహావీర్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి మాట్లాడుతూ ఈ భూహక్కు చట్టం వలన ప్రజల స్థిరాస్తి హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. ఈ చట్టం ద్వారా ఆస్తిహక్కును నిర్ణయించే అధికారాన్ని సివిల్ కోర్టు పరిధి నుంచి తీసేసి రెవెన్యూ అధికారులను ట్రిబ్యునల్ చైర్మన్‌లుగా పెట్టి వారికి అప్పగించారన్నారు. ఈ ట్రిబ్యునల్ సివిల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్, స్పెసిఫిక్ రిలీఫ్‌యాక్ట్, లిమిటేషన్ యాక్ట్‌లతో సంబంధం లేకుండా కేవలం సహజ న్యాయసూత్రాల ఆధారంగా టైటిల్‌ను డిసైడ్ చేస్తారన్నారు. ఈ సహజ న్యాయసూత్రాలకు సంబంధించి ఇంతవరకు ఎలాంటి చట్టాలు రూపొందించలేదన్నారు. ఈ ట్రిబ్యునల్ వ్యవస్థ ద్వారా ప్రజల ఆస్తి హక్కులు పెత్తందారులు, రాజకీయనాయకులు, రాజకీయపార్టీల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.